# మారాజు

రంగడు బొంబాయికో యచ్చిండు. ఆ డెప్పుడో బొంబాయిదాకా యెళ్లకుంట ఉండడని చానామంది అనుకున్నరు. యెర్రి బాగులోడు- ఆ పిచ్చోడు బొంబాయి దాకా ఒక్కడే యెట్లా యెళ్లిండా అనే తర్కాల పడ్డరు. గా నడుమ అదేదో పెద్ద సోపాల సదువంతా సదువుకున్న దొరగారి పిల్లగాడు లష్కర్ బోయిండట. పాపం ఆయన సదువుకున్నోడే కాని పట్నం గిట్నం ఎన్నడూ తిరగలేదట. పొంగ సోపతిగాళ్లు గా ఇంటికి పోవాల్నని పత్తా జెప్పింద్రంట. ఉట్టి నోటి మాట్నే సెప్పలేదట. ఓ కాయితం మీన రాసి కీసల వెట్టింద్రట. ఇగ ఆయన రైలెక్కిండు. అనుకున్న దగ్గర్నే దిగిండు. ఆ టేషన దాటంగనే పెద్ద సముద్రంల పడ్డ ట్టైంది. ఎటు వోవాల్నో దోసలేదు. రిక్ష బండ్లు, జట్కా బండ్లు ఇగ ఎన్నెన్నో కనిపించినయ్. రిక్షలోళ్లు, జట్కాలోళ్లు ఈయన సుట్టూ ఈగలోల్నె ముసురుకుని సేతులున్న సంచిని గుంజుకునుడు మొదలు వెట్టింద్రట. ఆ గడబిడల సేతుల రాసుకున్నది. జేబుల కాయిదం ఉన్నది యాదికే రాలేదట. రాత్రికి రాత్రంతా యాట్ల కచ్చెదాకా తిరిగిండట. ఇగ తెల్లారినంక యాదికచ్చిందట. జేబుల కాయిదం, గంత సదువుకున్నోడే గట్ల కష్టపడితే ఇగ రంగని మాట సెప్పాల్నా!

అయ్య చచ్చిపోయినాంక రంగడే ఇంటికి యజమానైండు. ఆనయ్య గప్పుడే సత్తడని యెవ్వళూ అనుకోలే. ఏదో మారసొంటిదచ్చింది. మూడు రోజులున్నడు. నాలుగోనాడు రంగనికి పెత్తనమచ్చింది. రంగడు ఆయ్య వోతే ఏడ్సిండో, నవ్విండో యెవ్వలకీ సరిగ్గా తెల్వదు. గానీ అయ్యాళ్ల కాటికి నిప్పంటించి బొళ్లున గుండంతా సెరువు జేసుకుని యేడ్సిండు. నెలరెన్నెళ్లు సంసారోలే బాకీలు వసూలు జేసుడు మొదలు వెట్టిండు. మొగడువోయిన పికరులున్న రంగని తల్లి ఈని పన్లు జూసి కొంచెమంత అటీటు కూసుంది. ఇగ కొడుకు మంచోడైండని సంబరంల వడ్డది, రంగని తల్లి.

ఆనాడు రంగనితల్లి పొరుగూరికి ఏందో పనుండంగ వోయింది. రంగడు గిదే మంచియాల్ల అనుకున్నడు. ఆయింత అవ్వ పెట్లార్ల దాసిన రూపాయలను ఎత్తుకొని అక్కింటికివోయి వత్తనని పెడ్లాముకు జెప్పి యెల్లిండు. రంగని పెండ్లాం నిజమేనని యెడ్డిదానోలె తలకాయ ఊపింది. రంగనితల్లి మూడు(రోజుల్దాక ఎదిరి జూసింది. ఆరం రోజులైనా రంగని పత్తా మాసుకంతైనా తెల్వలేదు. ఇగ ఆఖరికి ఆని తల్లి, బిడ్డింటికివోయి అరుసుకుంది. ఆడొచ్చిన తెల్లారే ఇంటికి వోతనని యెల్లివోయిండని బిడ్డ జెప్పింది. తల్లి గుండెల రాయివడ్డ ట్టైంది. నయమైనడనుకొన్న కొడుకు మర్లా ఎల్లిపోయిండనంగనే తల్లి కడుపు సెరువైంది. రంగడు వోయినాడంటే ఏమనియ్యలే. కాని ఆడెక్కడ రైల్నుజూసి జడుసుకొని పడిపోయిండో అని తల్లి మనసు తల్లడిల్లి పోయింది,

రంగడు రైలుమీన వోయిండనంగనే.

యాడాదికింద సిన్నాయిన్ని కొడుకుతోని రంగడు బంబాయి వస్తనని టేషన్‌కు వోతే, రైలు రాంగానే పిచ్చోనోలె కిందపడ్డట్టు యాదికచ్చింది రంగని తల్లికి, గంత గనం జడుసుకునే పోరడు సోపతిలేకుండ ఎట్లవోయిండోనని తల్లి పాణం గిలగిల తన్నుకున్నది.

**కొత్త శీర్షిక అలనాటి కథ!**
**అలనాటి మంచికథలని కొన్నింటిని నవతరానికి పరిచయం చేయడం ఈ శీర్షిక లక్ష్యం తెలంగాణా మాండలికంలో ... 1957లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో వెలువడిన ఈ కథని పునర్ముద్రిస్తున్నాం.**

ఇగ ఆని తల్లి ఇంటికచ్చి మంచం పట్టింది. కోడలిపోరి అంతకన్న ముందుగాల్నే సెప్పక సెయ్యక తల్లిగారింటి మొకాన ఎల్లిపోయింది.

ం౦

రంగడు అక్కింటికాన్నుంచి సక్కూంగా టేషన్ వోయిండు. అక్కడెవలన్న గురుతువడ్తరని బుజానేసుకున్న పంచె నెత్తిమీదకెళ్లి కప్పుకున్నడు. ఇగ రైలత్తదనంగా బంబాయికి టికటు కటాయించిండు. కట్టమీదికెళ్లి రైలత్తుందనంగ రంగని పాణం ఆకాసానికి ముట్టింది. పక్కకున్నోన్ని యాడికి వోతవని పాణం అరసేతుల పెట్టుకొని అడిగితే ఆడేదో సెప్పిండు. ఇగ సప్పుడు సెయ్యకుండ కండ్లు మూసుకొని నిల్చుండు. కీ... అని కీకవెట్టింది రైలు. రంగడు గజ్జుమన్నడు. గుండె దడదడ కొట్టుకున్నది. కాళ్లు సేతులు గజగజ వణకుడు మొదలు వెట్టినయ్. పెయ్యంత ముచ్చెమటలు వోసినయ్. హటో... హటో... అనుకుంటా పోలీసోడొచ్చిండు. అవ్వనాన్నోయ్ అనుకుంట రంగడొక్క దుంకు దుంకిండు. చెంప చిడిల్లుమన్నది. ఆడు మంటా మంటా అనుకుంటా మొత్తుకుండు. రైలు కీ... అని కూత వెట్టింది. ఆడుకండ్లు సగం తెరిసిండు. ఇసిత్రం రంగడు కాళ్లతోని నడువకుండానే ముందుకోతుండు. రైలు చటాచటా వోతుంది. గప్పుడు, రంగడెంత పరిశానైండు. సుట్టూ చూసిండు. బాగా మందికూసున్నరు. నిలుసున్నరు. ఇగ పాణం దక్కింది. పికరు లేదనుకున్నడు. మీదేసుకున్న పంచెకోసం దేవులాడిండు. గంత మందిల యెక్కడ వడ్డదో, దొరకకనే పాయె పాపం! ఉసూరుమంటూ గంతమంచి సెల్ల వాయె అని యిసారపడుతూ, మొలకు వెట్టుకున్న రూపాయల్ని జూసుకున్నడు.

తెల్లారింది. రంగడు నిలుసుండె నిదురపోయిండు. ఆడెప్పుడూ గంతే. మొద్దు నిదుర. పెంటల పన్న నిదురపడ్తదానికి. గప్పుడు సుట్టూ సానామంది కన్పియ్యలే. ఇగ అక్కన్నుంచి వోయి వో మూలకు సతికినట్టు కూసున్నడు.

బంబాయి ఎట్లున్నదో? ఎక్కడ దిగాల్నో? చెంచల్‌గూడకు ఎట్లవోవాల్నో? దిగంగనే దగ్గరున్న రూపాయల్ను ఎట్ల దాసుకోవాల్నో అని అలోచన్ల పడ్డడు.

బంబాయిల దిగే యాళ్లకన్నా ఎవడన్న సోపతికాడు కలువకపోతడా అనుకున్నడు రంగడు. కాని ఆనికి ఒక్కడన్నా చెంచల్‌గూడకు వోయె సోపతిగాడు కనిపియ్యలే. ఇగ ఏం చేయాల్నని ఇచారంల వడ్డడు. పెద్దల్ను చంపుకున్నంత ఏడ్పొచ్చింది. వూర్కెనన్న ఉన్నూరు యిడిసిపెట్టి పరాయి రాజ్యంల కస్తినని బెంగటీలిండు. ఆలోచన్లనే దయ్యాలోలే వొర్రే చొంగులు... యెన్క అన్నగాడన్నమాట లేవేవో యాది కచ్చినయి. ఆని తలకాయ గిర్రున తిరిగినట్టైంది.

గిట్ల రంగడు ఏమేమో అనుకుంటుండంగనే

బంబాయి టేషనచ్చింది. రంగడు బిక్కుబిక్కుమనుకుంటా మెల్లంగ రైలు దిగిండు... అబ్బ.. గంతమందిల ఎటువోవాలె ఏంది? రంగని కేమీ మనసున వట్టలేదు. తన పక్కకు కూసున్నాయనె వోతుంటే రంగడు ఆయన కాళ్లల్ల కాళ్లేసుకుంటపోయిండు. ఆయింతెట్లనో టేషన్ దాటిండు. ఇగ అవతల ఎటుపోవాలో, ఎవల్తో పోవాల్నో ఎవల్ని అడగాల్నో పల్లెటూరి రంగనికి వూర్లేసిపోయేంతమంది బొబ్బల్ల ఎటు తొవ్వగనవల్లె.

అవ్వేందో నడుత్తనే ఉన్నయ్. రంగడు మనుసులు తోలుతుంటే నడిసే మోటార్లను జూసిండు. కాని వుట్టిగనే ఆవిట్కి అవ్వే నడుత్తండంగ అని జన్మల ఎన్నడు సూల్లే- ఇన్లె. ఇంతింత ఎత్తు మడిమెలతో నడుత్తున్న ఆడోళ్లు, సేతులు సేతులు కలుపుకొన్ని పోతున్న మొగోళ్లనూ సూత్తుంటే రంగడు ఇది బూమి కాదనుకున్నడు. సిన్నప్పుడు తాత సెప్పిన ఇంద్రలోకమో అదేందో అనుకున్నడు. అచ్చె పోయెటోళ్లనూ- మోటార్లను ఇంక ఏంటెట్నో సూత్తూ బొమ్మోల్లే నిలుసున్నడు.

గింతట్లకే ఆయ్యవో దీపాలు ఎల్గినయ్. ఆనికి గప్పుడనిపించింది, అరే! పొద్దుతల్లి కడుపుల ఎప్పుడు వడ్డదో అని, ఇక్కడ తల్లి కడుపుల వడుతుందో లేదో అని అనుమానంల వడ్డడు. సెంద్రుడు కనిపియ్యనేలేదు. ఇయ్యాల్నే పున్నమని రంగనికి బాగా యాదికున్నది. ఇదేం ఇసిత్రలోకమో అనుకున్నడు. తనూరికి ఇక్కడికి ఎంతో కిందమీద కనిపించింది. తనూల్లో గిట్ల మనసుల్లేకుండనే ఆ బస్సులో - అవ్వేందో నడిపేయడముందా? గిట్ల ఆడోళ్లు, మొగోళ్లు కలసి నడుస్తరా? గింతమంది గుముగూడుతరా? గట్లనే పొద్దుగూకదో ఏమో? సెంద్రుడు ఉండడో ఏమో అనుకున్నడు రంగడు. గిట్ల ఆలోచన్లపడి ఎటన్నా పోవాల్ననిగూడ అనుకోలె. రాత్రయింది. ఆకలైంది. ఏం తినాల్నో తెల్వలె. సిన్నపుడు ముసల్దాని దగ్గర తిన్న బూడాలు లడ్లు యాదికచ్చినయ్.

రంగని మనసులో ఉవ్విళూరంగనే బూడాల వాసనచ్చింది. ఎన్కకు తిర్గి సూసి ఏకానిచ్చి బూడాలు కొనుక్కొని తిని, ఇన్ని మంచినీళ్లు తాగిండు. రాత్రంతా జాగారం చేసి ఇసిత్రాలన్నీ సూసిండు. తెల్లారినంక టేషనదాటి నడిసిపోయిండు. చెంచలగూడ ఎక్కడని అడుగుదామనుకుండు. గానీ ఎక్కడ జూసిన, అదేందో తురకం బాసల్నే మాట్లాడుకుంటుండ్రు. ఎక్కడ తెలగంల మాట్లాడెటోళ్లు రంగనికి కనిపియ్యనేలే. తిరిగిండు తిరిగిండు మల్ల అయ్యవో దీపాలు ఎల్గెదాక తిరిగిండు. గా రాత్రి ఓ కొనకు తెలగంల మాట్లాడుకుంట ఇసుపేటు ఆట ఆడుకుంటుండ్రు కొంతమంది. రంగడు పిల్లిముందు ఎల్కోలె ఆల్లదగ్గరికి పోయిండు. ఆల్లంతా మీసాలు వెంచుకొని, అడ్డబట్టలు కట్టుకొని సేతుల బనీన్లు తొడుక్కుని ఉన్నరు. ఆల్లను జూడంగనే పచ్చి దొంగలోల్నే అనిపించిండ్రు. ఒకసారి రంగని

**శ్రీ గూడూరి సీతారాం**


ఇంటెన్కున్న దొరగారింట్ల దొంగలు వడ్డపుడు, ఆల్లండ్ల కెల్లి ఒక్కన్ని పట్టుకున్నరు. ఆడు అచ్చంగా ఈళ్లోల్నే ఉన్నడు. ఆల్లతో మాట్లాడితే దగ్గరున్న రూపాయల్ను గుంజుకుంట్రేమోనని భయపడ్డడు రంగడు. ఇగమరి తెల్గోళ్లేమో మందుల కేత్తామన్నా కనిపియ్యకపోయిరి. రంగనికేమో తెల్గుకాక ఇంకో బాసనే రాపాయె. ఇగెట్లా మరి. ఆడు సిక్కుల వడ్డడు. ముందుకు జూత్తె నుయ్యి ఎన్కకు జూత్తె గోయ్యి, మరెట్లా అని యిచారింల వడ్డడు. ఇగెట్లైనన్నాయెనని తెగించిండు. ఆడచ్చిన సంగతి జెప్పిండు. ఆల్లు ఏమనుకున్నారో ఎందో? చెంచల్గూడకు తోలుకపోతమన్నరు. తోలుకపోయినందుకు రెండు రూపాయలియ్యమన్నరు. రంగడు గంగెద్దోలె తలూపిండు.

రంగనికి తెలివైనాంక జూత్తేమున్నది. ఒక్కరూపాయి లేకుండ గుంజుకున్నరు. లబోలబో మొత్తుకున్నడు. అంతట్లకే పహారా ఉషారనుకుంటా పోలీసచ్చిండు. రంగని పాణం గతుక్కుమంది. ఏడుత్తున్నోడల్లా సగం సచ్చినోన్లె కూసున్నడు. పోలీసోడు రంగని దగ్గరికచ్చి అదేందో బాసల తిడుతూ నాల్గంటించిండు. గప్పటికే గుండె గుబేల్ గుబేల్ మంది. ఆ ఇంటి పోలీసోడు కొట్టంగనే సచ్చినోని తరీకనే అయిపోయిండు. మాటా లేదు. ముచ్చెట లేదు. పోలీసోడేమో బాసలో తిడుతనే ఉన్నడు.

రంగడు కండ్లు తెరసి జూసిండు పక్కకు సిన్నాయిన్న కొడుకు కనిపించిండు. లేసిపోయిన పాణం తిర్గచ్చింది రంగనికి. ఇగ బతుకు బాబోయ్ అనుకున్నడు. 'కొంచెంలైతే రంగడు మనోడు కాకుండా పోవు. పోలీసోడు పట్టుకబోతుంటే నేను జూసి యిడిపిచ్చుకచ్చినా' అని అన్నగాడు ఆ నూరోళ్లతో సెప్పంగ ఇన్నడు. పోలీసులు పట్టుకపోయిండ్రనే మాట ఇనంగనే రంగనికి జరమందుకున్నది. ఆరం రోజుల్కా అచ్చిన జరం జార్నే లేదు. గా జరంలనే అన్నగాడు రంగన్ని ఇంటికి తీసుకచ్చిండు.

ఆనాడు రంగనింట్ల తీర్థం సాగింది. సీమల బారోలె వూళ్లోళ్లందరు అచ్చి జూసిండ్రు. రంగని తల్లి కంటికి మంటికి ఏకదారోలేడ్చింది. "నీ కొడుక్కేందవ్వ. బతికి బయటపడ్డడు. మారాజు" చూడచ్చి నోళ్లందరు గదే పాట పాడిండ్రు.

## హీరోగా ఓకే!



ఇటీవల విడుదలైన 'ప్రేమకథ' సినిమాద్వారా పరిచయం అయిన సుమంత్....అక్కినేని నాగేశ్వరరావు మనవడు, నాగార్జున మేనల్లుడు....ఆర్టిస్టుగా హిట్ అయాడు. హీరో సుమంత్ సూరిపాత్రలో ఆకతాయితనాన్ని, అల్లరిని, ప్రేమానురాగాన్ని ఎంత బాగా అభినయించాడో; ఉద్వేగాన్ని, ఉద్రేకాన్నికూడా అంతే బాగా అభినయించాడు అని ప్రేక్షకులనుండి అభినందనలు అందుకుంటున్నాడు. మంచి ఈజ్ ఉన్న మరోహీరో లభించాడని పరిశ్రమువర్గాలు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. చిత్రం కథ ఎంపికలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ప్రకాష్